క్లుప్తంగా

రూ. 20వేల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

గంగవరం: కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయానికి రూ.20 వేలను విరాళంగా దాతలు శనివారం అందజేశారు. పలమనేరుకు చెందిన దాతలు నల్లారెడ్డి విరాళాన్ని ఇచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. ఆలయంలో జరిగే నిత్య అర్చన సేవకు ఈ నగదును వినియోగించాల్సిందిగా దాతలు కోరినట్టు పేర్కొన్నారు. ఆలయ ప్రధానార్చకులు దేవరాజాచార్యులు ఉన్నారు.

మాదిగల సభకు తరలిరండి

పుంగనూరు: మాదిగల విశ్వరూప సభ హైదరాబాద్‌లో ఈనెల చివరి వారంలో నిర్వహిస్తామని, ప్రతిఒక్కరూ తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు తెలిపారు. శనివారం నియోజకవర్గస్థాయి సమావేశాన్ని జిల్లా ఇన్‌చార్జ్ దుడ్డు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో మందకృష్ణ మాదిగ చేపట్టిన సభకు ప్రతి జిల్లా నుంచి లక్షలాది మంది తరలిరావాలని కోరారు. వెంకట్రమణ, నాగభూషణం, అంజప్ప, హరిబాబు, గోవిందు, సుబ్రమణ్యం, సోము, మణి, నారాయణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


సుకుమార్

పుంగనూరు: పుంగనూరు ఎస్‌ఐగా సుకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్‌ఐ–2 పోస్టు ఖాళీగా ఉండడంతో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి సుకుమార్‌ను నియమించారు. కాగా ఎస్ఐ–1గా మోహన్‌కుమార్ కొనసాగుతున్నారు. పలువురు పట్టణ ప్రముఖులు నూతన ఎస్ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


మురళీధర్ (ఫైల్)

చౌడేపల్లి: రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సి.మురళీధర్(67) శనివారం మృతిచెందారు. ఉపాధ్యాయుడుగా మండలంలో విశిష్ట సేవలందించారు. ఆయన మృతి పట్ల ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఫ్లై ఓవర్‌పై విద్యుత్ దీపాల ఏర్పాటు

కుప్పంరూరల్: రైల్వే ఫ్లైఓవర్‌పై పదిహేను రోజులుగా అంధకారం నెలకొన్న విషయాన్ని కొందరు యువకులు మున్సిపల్ చైర్మన్ సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన శనివారం దగ్గరుండి ఫ్లై ఓవర్‌పై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలకు పాదయాత్ర


బయలుదేరుతున్న యువకులు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపలెకు చెందిన యువకులు శనివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. బాటగంగమ్మ ఆలయంలో పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు భక్తులు పేర్కొన్నారు.

రైతు నేస్తాలు.. ఆర్బీకేలు


ఆర్బీకేలో రాగి విత్తనాల పంపిణీ (ఫైల్)


సదుం ఆర్బీకే

- రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతల వద్దకే సేవలు
- రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు
- ఈక్రాప్‌తో పంటలకు పరిహారం

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు రాజయ్యాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసింది. సచివాలయాల వద్దే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను రైతన్నలకు చేరువ చేశారు. రైతులకు అండగా నిలిచారు. రైతు కష్టాలకు చెక్ పెట్టారు. స్థానికంగానే విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు, అధికారుల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

రైతు భరోసా పొందుతున్న రైతుల వివరాలు

రైతుల సంఖ్య :	6,239
నగదు :	రూ. 21.9 కోట్లు
కౌలు రైతుల సంఖ్య :	66
పంపిణీ చేసిన ఎరువులు :	268 మెట్రిక్ టన్నులు
స్టాక్ :	77 మెట్రిక్ టన్నులు

ఖరీఫ్‌లో పంపిణీ చేసిన విత్తనాలు:

1. వేరుశనగ :	1,440 క్వింటాళ్లు
2. కందులు :	16 క్వింటాళ్లు
3. రాగులు :	10.8 క్వింటాళ్లు
4. కొర్రలు :	0.40 క్వింటాళ్లు

11 ఆర్బీకేలు: మండలంలో 11 ఆర్బీకేలు ఉన్నాయి. వీటిలో పదింటికి సొంత భవనాలు ఉన్నాయి. ఒక్కటి మాత్రం నిర్మాణం పూర్తికావొచ్చింది. ప్రతి ఆర్బీకేలో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో పాటు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ సేవలు అందిస్తున్నారు. రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగులమందులు, సాగుకు అవసరమైన యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈక్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం వంటి సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ కియోస్కోలో ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులకు అవసరమైన వాటిని అందులో నమోదు చేసుకుని, నగదు చెల్లిస్తే బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. పంట ఉత్పత్తులను సైతం కొనుగోలు చేస్తూ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తున్నారు. దీంతో పంటల సాగుకు ఇబ్బందులు తప్పాయని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారం తప్పింది

గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇది ఎంతో భారంగా ఉండేది. ప్రస్తుతం స్థానికంగా ఆర్బీకేల్లోనే అందుతున్నాయి. దీంతో రైతులకు వ్యవసాయం ఎంతగానో సులభతరమైంది. అధికారులు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు ఇస్తున్నారు.

–ఎల్లారెడ్డి, కంభంవారిపల్లె

మెరుగైన సేవలు



ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేలా కృషిచేస్తున్నాం. వారికి పంటల సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహకాలను తెలియజేస్తూ, సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

–హరిప్రసాద్, ఏఓ, సదుం

ఆర్బీకేలు ఆదర్శం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఆర్బీకే వ్యవస్థ అందరికీ ఆదర్శంగా నిలిచింది. రైతులకు పలు రకాల సేవలు అందిస్తూ, అవి ఎంతగానో ఉపయోగకరంగా మారాయి. రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

–ఎల్లప్ప, ఎంపీపీ, సదుం

సేంద్రియ సేద్యమే రక్ష


విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: సాగు చేసే రైతులు, వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకునే వినియోగదారులకు సేంద్రియ సేద్యమే రక్ష అని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు జిల్లా షెడ్యూలు కులాల సేవా సహకార సంఘం ఉచిత విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శాంతిపురం, కుప్పం, గుడుపల్లి, రామకుప్పం మండలాల రైతులతో ఆయన మాట్లాడారు. పర్యావరణ మార్పులు, వ్యవసాయంలో మితిమీరిన రసాయన వినియోగం కారణంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. వీటిని అధిగమించి మనుషులతో పాటు ఇతర జీవుల రక్షణకు సహజ సిద్ధ వ్యవసాయమే మార్గమని చెప్పారు. సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే పీఎం అజైయ్ కింద పెరటి తోటల పెంపునకు ఉచితంగా విత్తనాలను అందిస్తోందన్నారు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో 1,205 మంది సేంద్రియ సేద్యం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా పెరటి తోట విత్తనాల కిట్లను అందిస్తున్నామని చెప్పారు. అందులో 518 కిట్లు కుప్పం నియోజకవర్గ రైతులకు ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ పద్దాది మధుసూదన్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం శ్రీనివాసులు, ఎన్ రవికుమార్, ఎల్ రవిబాబు, రైతు సాధికార సంస్థ డీపీఎం వాసు, మేఘనాథన్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, శాంతిపురం, రామకుప్పం పార్టీ కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, విజలాపురం బాబురెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న భరత్

కుప్పం: నియోజకవర్గ పరిధిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్సీ భరత్ బాధితులకు అందజేశారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. కుప్పం మండలం, మంకలదొడ్డి గ్రామానికి చెందిన నితీష్ కుటుంబానికి రూ. లక్ష, రామకుప్పం మండలానికి చెందిన అనూష(వలంటీర్) కుటుంబానికి రూ.50 వేలు, శాంతిపురం మండలం సొన్నేగానిపల్లి పంచాయతీ నాయినపల్లికు చెందిన మంజునాథ్ కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కుప్పం మండల కన్వీనర్ మురుగేష్, శాంతిపురం కన్వీనర్ బుల్లెట్ దండపాణి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి

రొంపిచెర్ల: వ్యవసాయసాగులో పురుగుల మందుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన వ్యవసాయ పంటల సాగు, పురుగులమందు వాడకంపై రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రం–2లో శనివారం రైతులకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. వ్యవసాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలతో పంటలను సాగుచేయాలని అన్నారు. శాస్త్రవేత్తలు దేవకి, నాగిరెడ్డి, భార్గవ రామిరెడ్డి, ఆర్‌బీకే ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

పాలన చూసి ఆదరించండి


మండిపేటలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచన

పలమనేరు: అమ్మ నీతి, నిజాయితీకి మారుపేరైన ప్రభుత్వమిది, ఇక్కడ అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే చెప్పండి, వెంటనే మంజూరు చేయిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచించారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలంలోని మండిపేట కోటూరు సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా వారికి కలిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. అవసరమైన సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ పరిధిలోని పాత సాంబార్‌పూర్, ఎం కోటూరు, కాలువపల్లి, ఈసరపెంట గ్రామాల్లో 699 ఇళ్లను సందర్శించారు. మండిపేటలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలా జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలను ఇవ్వడం లేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మండిపేట గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, వైస్ ఎంపీపీ జయశ్రీ బాలాజీనాయుడు, గజేంద్ర, మండల కన్వీనర్ బాలాజి నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, స్థానిక సర్పంచ్ చినపాప, ఎంపీటీసీ రమేష్, సచివాలయాల కన్వీనర్ తిరుమలేష్, ఆస్పత్రి కమిటీ చెర్మన్ చెంగారెడ్డి, నేతలు విశ్వంనాయుడు, గోవిందునాయుడు, మునిరత్నం, అయ్యాకన్ను, హరికృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై విచారణ


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని పలు వార్డుల్లో ఓటర్ల సమ్మరీ స్పెషల్ రివిజన్ కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ అధికారులు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి డబుల్ ఎంట్రీలు, చేర్పులు, తొలగింపులపై ఆరా తీసి అవసరమైన చర్యలను తీసుకున్నారు. ప్రత్యేక అధికారులు నవీన్ న్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత


మొక్కలను పంపిణీ చేస్తున్న అమరేంద్ర

వి.కోట: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని, ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని జూనియర్ కళాశాల చైర్మన్ అమరేంద్ర అన్నారు. శనివారం బాలేంద్రపల్లిలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను రైతులకు, ప్రజలకు పంపిణీ చేశారు. గ్రామస్తులు అమరేంద్ర, నరేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ మురుగేష్, శరత్‌రామ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు


పీర్లకు పూజలు చేస్తున్న సుధీర్‌రెడ్డి

సదుం:బూరగమందలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు శుక్రవారం రాత్రి నిర్వహించిన అగ్నిగుండ ప్రవేశంతో ఘనంగా ముగిశాయి. వేడుకల్లో వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పీర్లకు పూజలు చేసి, ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. రెడ్డెప్పరెడ్డి, రమేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాగిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంపీపీ వసుంధర

శాంతిపురం: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ వసుంధర అన్నారు. శనివారం మండల సచివాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. తాగునీరు, పారిశుధ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రజలతో గౌరవంగా మెలగాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు కోరారు. తహసీల్దార్ నరసింహులు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల సవరణలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇంటింటికీ నిత్యావసరాలు అందిస్తున్న ఎండీ ఆపరేటర్లు రాజీనామా చేశారని చెప్పారు. గుంజార్లపల్లి–కెనమాకులపల్లి పంచాయతీల మధ్య ఉన్న ఎంఎస్ఆర్ కాలనీ ఏ పంచాయతీ పరిధిలోకి వస్తుందో తేల్చాలని సర్పంచ్ ఏవీ జయరాం డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా మ్యుటేషన్లు చేయడంతో మండలంలో భౌతికంగా 80 వేల ఎకరాల భూములు ఉంటే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం లక్ష ఎకరాలు ఉన్నాయని సర్పంచ్ జనార్దనరెడ్డి చెప్పారు. చిన్నారిదొడ్డి నుంచి గొల్లపల్లి వెళ్లే రోడ్డు ఆక్రమణలు నిర్ధారణ అయినా అధికారులు చర్యలు తీసుకోలేదని సర్పంచ్ రేణుక సభ దృష్టికి తెచ్చారు. గెసికపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఎంపీటీసీ యువరాజ్, బెండనకుప్పంలో ఇంటింటికి నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఎంపీటీసీ రవికుమార్ చెప్పారు. ఎంపీడీఓ హేమమాలిని, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ విశాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు నిసార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


గంటావూరులో నాటుతున్న మొక్కలు

పలమనేరు: నాభూమి–నాదేశం నేలతల్లికి నమస్కారం– వీరులకు వందనం అనే నినాదంతో ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో ఈనెల 15వరకు సాగే కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది ఆయా వార్డు కౌన్సిలర్లతో కలిసి పట్టణంలో శనివారం మొక్కలను నాటారు. పట్టణ కన్వీనర్ జాఫర్ గంటావూరులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలను టి.వడ్డూరులో సర్పంచ్ మునస్వామి నిర్వహించారు.

ఘనంగా నా భూమి–నాదేశం


సదుం: మొక్కలు నాటుతున్న నేతలు

సదుం: మండలంలోని నడిగడ్డలో నాభూమి–నా దేశం కార్యక్రమం శనివారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ నారాయణరెడ్డి, నాగభూషణంరెడ్డి, ఏపీఓ శివశంకర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం

గుడుపల్లె: ప్రస్తుత వాతవరణ పరిస్థితుల్లో స్క్రబ్ టైపస్ అనే విష జ్వరం వ్యాపిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, వైద్యుడు సుబ్రమణ్యం అన్నారు. కుప్పంలో ఒక కేసు నమోదైందన్నారు.

ఆలయానికి ఇన్‌వర్టర్ వితరణ



పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటకకు చెందిన వేణుగోపాల్ అనే దాత రూ.40 వేల విలువ చేసే బ్యాటరీలు, ఇన్‌వర్టర్ వితరణగా ఇచ్చారు. శనివారం ఆలయ ఈఓ మునీంద్రబాబు సమక్షంలో భక్తుడు వేణుగోపాల్ ఇన్‌వర్టర్‌ను అందజేశారు.